క్లుప్తంగా

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



దివ్యాంగులకు పాస్‌లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న నర్సయ్య

కనిగిరి రూరల్: సాయికృష్ణా దివ్యాంగుల ఆశ్రమంలో గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు దోసపాటి నరసయ్య ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆర్టీసీ రాయితీ పాస్‌లను, స్వీట్లను పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమ నాయకులు పాలూరు వెంకటేశ్వర్లు, ఇంద్ర కంటి దేవ, రమణయ్య, కిషోర్, సాయి పాల్గొన్నారు.

పామూరు సీఐగా రామానాయక్ బాధ్యతల స్వీకరణ



ఎం రామానాయక్

పామూరు: పామూరు సీఐగా ఎం రామానాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. సర్కిల్ పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గుంటూరు ఎస్సీ, ఎస్టీ సెల్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీపై పామూరు సీఐగా వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న కాటూరి శ్రీనివాసరావు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి బదిలీపై వెళ్లారు.

గాలి కుంటు వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవాలి

– పశు సంవర్ధక శాఖ జేడీ బేబీరాణి



గుండ్లసముద్రంలో రైతులతో మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

మర్రిపూడి: మండలంలోని ప్రతి రైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా కాపాడుకోవాలని పశుసంవర్ధక శాఖాధికారి కె.బేబిరాణి సూచించారు. గురువారం మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పశువులకు వైరస్ వల్ల గాలికుంటు వ్యాధి సోకుతుందన్నారు. వ్యాధి బారిన పడిన పశువుల్లో పనిచేసే సామర్థ్యం, ఆడపశువుల్లో ఉత్పత్తి సామర్థ్యం, చూడి పశువులు ఈసుకుపోవడం, చిన్నదూడలు చనిపోవడం జరుగుతుందన్నారు. పశు వైద్యశాలలో టీకాలు అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 31 వరకు టీకాలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి జి.శ్రావణి, వీహెచ్ఏ రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ రేపు

వలేటివారిపాలెం: మండల కేంద్రమైన వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు పెరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరగనునట్లు ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు శాసన సభ్యుడు మహీధర్‌రెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు.

గుడ్లూరు: మండల పరిధిలో నూతనంగా పింఛన్లు మంజూరు అయిన పెన్షనర్లకు ధ్రువీకరణ పత్రాలతో పాటు ప్రభుత్వం పెంచిన రూ.3వేల పింఛన్ల పంపిణీ శుక్రవారం జరుగుతుందని ఎంపీడీఓ రాజశేఖరరావు గురువారం తెలిపారు. స్థానిక ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి హాజరు అవుతారని ఎంపీడీఓ తెలిపారు.

జిల్లా స్థాయి హాకీ జట్టు ఎంపిక రేపు

చీమకుర్తి: ప్రకాశం జిల్లా స్థాయి జూనియర్ హాకీ జట్టును ఈనెల 6న ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూలులో ఎంపిక చేయనున్నట్లు హాకీ కోచ్ రవికుమార్ చీమకుర్తిలో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9,10,11,12 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. ఎంపికలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

జ్ఞానమే భక్తికి సోపానం

ఒంగోలు మెట్రో: సంతపేట షిరిడీ సాయి మందిరంలో వెలసిన వెంకటేశ్వర స్వామి సన్నిధిలో తిరుప్పావై మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఉపన్యాసకులు నెమ్మాని సీతారామమూర్తి గురువారం 19వ పాశుర ప్రాధాన్యం వివరించారు. అర్థ పంచక జ్ఞానం గురించి తెలిపారు. భక్తి జ్ఞానానికి సిద్ధాంజనం లాంటిది అని పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షుడు అళహరి చెంచలరావు, ప్రధాన అర్చకులు ఉన్నారు.

సమాజం చైతన్యం కావాలి



మహిళా ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఎంఈఓ



కందుకూరు : సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తూ..

కందుకూరు: భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పట్టణంలోని ఎఫ్‌–3 రెస్టారెంట్‌లో జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ, ధమ్మ చక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ముప్పవరపు కిషోర్ మాట్లాడుతూ భారత సమాజం వెలివేసిన నిమ్నవర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే బావజాలంతో సమాజం చైతన్యం కావాలన్నారు. మహిళలు చదువుకోవాలని భావించిన తన భర్త మహాత్మా జ్యోతిరావ్ పూలే, ఆదర్శాలకు అనుగుణంగా సావిత్రిబాయి పూలే చదువు నేర్చుకుందన్నారు. అలాగే దళిల బడుగు వర్గాల మహిళలకు చదువులు నేర్పే బాధ్యత తీసుకున్నారని శ్లాఘించారు. ధమ్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షుడు గాండ్ల హరిప్రసాద్ బోది అల్లు వెంకటేశ్వర్లు, పాశం కొండయ్య, చనమాల కోటేశ్వరరావు, పాలేటి సుచరిత, గోపనబోయిన నర్సయ్య, ముతకాని లక్ష్మీనారాయణ, గేరా మనోహర్, షేక్ హమీద షేక్ మహబూబ్‌బాషా, ఉచ్చులూరి రవీంద్ర, ముప్పవరపు రమేస్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సావిత్రిబాయి పూలే కృషి ఎనలేనిది

సీఎస్‌పురం(పామూరు): మహిళల విద్యతోనే సమాజంలో మార్పు తథ్యమని గుర్తించి మహిళా విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి ఎనలేనిదని ఎంఈఓ జగన్నాథం ప్రసాదరావు, రాష్ట్ర మానవహక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ షేక్.గౌస్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం చెన్నపునాయునిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం షేక్.ఛాంద్‌బాషా అధ్యక్షతన అంబవరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని మహిళా ఉపాధ్యాయినులకు సన్మానించారు. సావిత్రిబాయ్‌పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ యనమల పెద్దసుబ్బయ్య, పీఎస్ బుర్రి గురవయ్య, పీఎంసీ చైర్మన్ ఖాదర్‌రజాక్, మహిళా ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న యూనియన్ నాయకులు

కందుకూరు: ఏఐటీయూసీ అనుబంధ స్కందపురి పెయింట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పెయింట్ వర్కర్స్ యూనియన్ సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని, సమస్యలు ఏమి ఉన్నా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. పెయింట్ వర్కర్స్‌కి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చుకోవాలన్నారు. అనంతరం పట్టణ ఎస్సై హనీఫ్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అధ్యక్ష, కార్యదర్శులు జమ్మలమడుగు రవి, కంకణాల చిన్న బ్రహ్మయ్య, కోశాధికారి నాగరాజు, యూనియన్ నాయకులు బిట్రా శ్రీను, బి.రోజా బాబు, మాలకొండయ్య పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమష్టి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ గంగసాని లక్ష్మి

పామూరు: మండల అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో గురువారం ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు ఆకుపాటి వెంకటేష్, రెక్కల అనితారెడ్డి, సర్పంచ్‌లు దారపనేని కొండబాబు, కందుల శ్రీనివాసరెడ్డి, యం.రాధాకృష్ణ, నీరుకట్టు వేణు పలువురు సర్పంచ్‌లు ఎనర్జీ అసిస్టెంట్‌లు విధులకు సరిగా హాజరు కావడం లేదని, విధులకు డుమ్మాకొడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకురాగా విధులకు డుమ్మా కొట్టిన వారిపై చర్యలకు సిఫార్సు చేయాలని ఎంపీడీఓ, విద్యుత్ శాఖాదికారులకు సూచించారు. ఖాళీగా ఉన్న ఆశాకార్యకర్తల పోస్టులను భర్తీచేయాలని సర్పంచ్ బద్దిపూడి శారమ్మ కోరగా విషయాన్ని జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకుపోతామన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ శ్రీసాయి పశువుల్లో గాలికుంటు కేసులు బయటపడుతున్నాయని తెలపగా దీనిపై ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో ఎక్కడైనా పశువులకు గాలికుంటు లక్షణాలు ఉంటే పశుపోషకులను అప్రమత్తం చేయాలని, టీకాలు అందుబాటులో ఉంచాలని డాక్టర్‌కు సూచించారు. రబీ సీజన్ పంటలకు ఈక్రాప్ చేయించుకోవాలని, ఇటీవల తుఫానుకు నష్టపోయిన పంటలకు పరిహారంకోసం నివేదికలు పంపామని చెప్పగా జీరో ఖాతాల వల్ల గతంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఇకపై జీరో ఖాతాల నుంచి తొలగించిన వారికి కూడా ప్రభుత్వ పథకాలు, పరిహారం అందేలా చూడాలని, రాయితీపై వ్యవసాయ పనిముట్లు రైతులకు అందించేలా చర్యలు చేపట్టాలని ఏఓ కంచం రాధకు సూచించారు. గృహనిర్మాణాల బిల్లులపై పలువురు ప్రశ్నించగా నిర్మాణాలు త్వరితగిన పూర్తిచేస్తే వెంటనే బిల్లులు మంజూరుచేస్తామని ఏఈ బి.రాజమోహన్ తెలిపారు. వైఎస్సార్ కేపీ ఏపీఎం రజనీకుమారి మాట్లాడుతూ త్వరలో వైఎస్సాఆర్ ఆసరా, వైఎస్సాఆర్ చేయూత పథకాల నిధులు ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తుందని తెలపగా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాల లబ్ధి పొందేలా చూడాలని సూచించారు. ఐసీడీఎస్, మహిళా పోలీసులు సమన్వయంతో పనిచేసి బాల్యవివాహాలను పూర్తిగా నిలువరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, పార్వతిలకు ఎంపీపీ సూచించారు. సమావేశానికి గైర్హాజరైన వివిధ శాఖల అధికారులపై చర్యలకు సిఫార్సు చేయాలని ఎంపీడీఓకు సూచించారు. ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ గంధం యేసురత్నం, సింగిల్‌విండో చైర్మన్ పువ్వాడి వెంకటసుజాత, ఈఓపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, కో ఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, పోలినేని శ్రీను, గట్లా శివకుమారి, ఆకుపాటి వెంకటేష్, షేక్.నాసర్‌బీ, మెడబలిమి ఆదిలక్ష్మి, సవరం రత్తమ్మ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సెక్రటరీ రవీంద్ర



ఎమ్మెల్యేకు ధన్యావాదాలు తెలియజేస్తున్న రవీంద్ర, నాయకులు

కందుకూరు: వైఎస్సార్ సీపీ కందుకూరు పట్టణ సెక్రటరీగా ఆది ఆంధ్రకాలనీ నివాసి ఉచ్చులూరి రవీంద్రను నియమించారు. దీంతో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ పదవికి వన్నె తెచ్చే విధంగా పని చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గడ్డం విజయకుమార్, ఉచ్చులూరి రమేష్, సూరపోగు రాజశేఖర్, గంధం సన్నీ, తొండల ఆదాము, రొడ్డా సుదర్శనం, ఎండ్లూరి నాగరాజు, పేమల మోహన్, తిరుపాలు, జగదీష్, ప్రవీణ్, వంకాయలపాటి సులోమాను, సురేష్, కౌశిక్, మధన్, అశోక్, రోహిత్, జాన్, పట్టణ అధ్యక్షులు ఎస్‌కే.రఫి, జెసీఎస్ కన్వీనర్ ముప్పవరపు కిషోర్, గణేషం గంగిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి స్పాట్ వాల్యుయేషన్

కందుకూరు రూరల్: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం మొదటి సంవత్సరం స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్ టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ తెలిపారు. లాంగ్వేజెస్ (ఇంగ్లిష్, తెలుగు, హిందీ, సంస్కృతం) సబ్జెక్టులకు సంబంధించి మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. కందుకూరు, సింగరాయకొండ, ఉలవపాడు, కనిగిరి, పామూరు, సీఎస్.పురం, కొండపికి చెందిన ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు తమ స్పాట్ వాల్యుయేషన్ ఆర్డర్స్‌లను తీసుకొని క్యాంప్ ఆఫీసర్‌కు రిపోర్టు చేయాలని తెలిపారు.

రోడ్లపై చెత్త వేయవద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చైర్మన్ గఫార్, కమిషనర్

కనిగిరి రూరల్: ఇంట్లో నుంచి వ్యర్థాలు, చెత్తా చెదారాలను రోడ్లపై వేయవద్దని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, కమిషనర్ నారాయణరావు పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉన్నారని, అందువల్ల పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరు కావడం లేదన్నారు. ప్రజలు గమనించి ఇంట్లో నుంచి వచ్చే చెత్త చెదారాన్ని బయట రోడ్లపై వేయకుండా మున్సిపల్ కార్యాలయం నుంచి ఇళ్ల వద్దకు వచ్చే ప్రత్యేక ట్రాక్టర్‌లో వేయాలన్నారు. వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు దేవకి రాజీవ్, పులి శ్రీనివాసులరెడ్డి, దాసరి మురళీ, తిరుపతయ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయకులకు శిక్షణ



మాట్లాడుతున్న కేవీకే హెడ్ ప్రసాద్‌బాబు

కందుకూరు రూరల్: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో కందుకూరు డివిజన్ ఆర్‌బీకే గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జి.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న పొగాకు, శనగ, వేరుశనగ, మినుము, మిరప పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పొగాకులో లద్దె పురుగు, ఆకుమచ్చ తెగులు, వేరుశనగలో మొదలుకుళ్లు, వేరుకుళ్లు, మిరపలో ఆకుముడత, వైరస్ తెగుళ్లు ఉన్నాయని వాటి నివారణకు చేపట్టవలసిన సమగ్ర సమస్య రక్షణచర్యలపై అవగాహన కల్పించి ఆ సమాచారాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. అలాగే ఇంటర్నెట్, వీవీ ఐసీటీ మాధ్యమాల ద్వారా పొలం దగ్గరే రైతుకు కావాల్సిన సమాచారం పొందే మార్గాలను తెలియజేయాలన్నారు. ఏడీఏ అనసూయ మాట్లాడుతూ ఆర్‌బీకే సిబ్బంది గ్రామ స్థాయిలో పొలాలను సందర్శించి రైతులకు పంటల్లో సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఆర్‌బీకే సేవలను రైతులకు చేరవేయాలని, సమగ్ర ఎరువుల వినియోగంపై ఆర్‌బీకేలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గుడ్లూరు, వలేటివారిపాలెం, ఉలవపాడు మండల వ్యవసాయ అధికారులు రవికుమార్, భరత్ కుమార్, తిరుమలజ్యోతి, ఎస్‌టీఎల్ ల్యాబ్ అధికారి గీతాప్రకాష్, టెక్నికల్ ఏఓ దుర్గాలు వ్యవసాయ పథకాల అమలు, ఇ–పంట నమోదు పనితీరు గురించి వివరించారు.

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్ నగదు అందచేస్తున్న వైస్ చైర్మన్ పులి శాంతి



వాలిచర్లలో పింఛన్ నగదు అందజేస్తున్న నేతలు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక 18వ వార్డులో నూతన పెన్షన్లు, పెంచిన పెన్షన్ కానుకలను గురువారం అందచేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెన్షన్ నగదును పెంచి అందచేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వార్డు కన్వీనర్ బసిరెడ్డి పిచ్చిరెడ్డి, గృహ సారథులు పండ్ల ఖాదర్, చెంచులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని వాలిచర్ల సచివాలయ పరిధిలో గురువారం పెరిగిన పెన్షన్లు పంపిణీ చేశారు. సర్పంచ్ కత్తి మరియబాబు, రైతు సంఘం గ్రూపుల చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. తొలుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యదర్శి సంధ్య, నాయకులు జి.ఆదినారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ అంజలి, సచివాలయ కన్వీనర్ కత్తి పిచ్చయ్య, ఏ సుబ్బారెడ్డి, అశోక్, లాజర్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర విజయవంతం చేయాలి



క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ లలిత



ఆడుదాం ఆంధ్రా టీషర్టులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

హనుమంతునిపాడు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.లలిత, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా దుస్తులు, క్యాప్‌లు 14 గ్రామ సచివాలయాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 10 నుంచి 23 వరకు జరుగుతాయన్నారు. సచివాలయ స్థాయిలో జరిగిన క్రీడల్లో గెలుపొందిన జట్లకు మండల స్థాయిలోని హెచ్‌ఎంపాడు జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు, టోపీలు అందచేశామన్నారు. మండల స్థాయిలో జరిగే క్రీడలు విజయవంతం చేయాలని సచివాయల సిబ్బంది, సర్పంచ్‌లను కోరారు. మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, ఏఓ క్రిష్టారావు, పంచాయతీల విస్తరణ అధికారి షేక్ షరీఫ్, సర్పంచ్ కత్తిరాజారావు, మహ్మదాపురం సర్పంచ్ పల్లపోలీ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, విక్రమ్, సురేంద్ర, సాయి పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు, టోపీలు పంపిణీ

మర్రిపూడి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని 13 సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా టీషర్టులు, టోపీలను ఎంపీపీ వాకా వెంకటరెడ్డి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని ఇస్తాయన్నారు. క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించి గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏవో ఎస్‌కే ఖాశింపీరా, సర్పంచ్ కె.భాస్కర్, మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు మాదిరెడ్డి, కె.ఇబ్రాయిల్, సుభాార్, ఆర్.నరసింహారావు, పంచాయతీ కార్యదర్శులు దుర్గాప్రసాద్, గాయత్రి పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి

సీఎస్‌పురం(పామూరు): పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జవంగుల వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి షేక్.పాదుషాలు అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగం అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను హెచ్‌ఎం చేతుల మీదుగా పంపిణీ చేశారు. దాతల చేయూతను విద్యార్థులు ఉపయోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. జి.వేమనారాయణ, హెచ్.ఆంజనేయులు, ఐ.కొండయ్య, పోతురాజు, గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.



మోడల్ టెస్ట్ పేపర్స్ అందజేస్తున్న ఎస్ఓ, యూటీఎఫ్ నేతలు

ఆధునిక పద్ధతులపై అవగాహన అవసరం



పామూరులో ఎరువుల మందులను పంపిణీ చేస్తున్న డీన్, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రరావు అన్నారు. మండలంలోని నల్లమడుగుల, రాజుపాలెం గ్రామ పంచాయతీల పరిధిలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వివరించారు. ఈఓపీఆర్డీ కె.సుందరరామయ్య, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): ఆధునిక వ్యవసాయం వైపు యువత దృష్టి సారించాలని కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బజాజ్ బుజ్జి అన్నారు. మండలంలోని కోవిలంపాడు సచివాలయంలో కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన తెగుళ్ల నివారణ ఎరువులను పంపిణీ చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ జనార్దన్, సర్పంచ్ షేక్.ఖాదర్‌బీ, ఉపసర్పంచ్ టి.బాబూరావు, గోను చంద్రశేఖర్‌రెడ్డి, భూమిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమాతో ధీమా



క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

లింగసముద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేషుబాబు కోరారు. గురువారం ముత్యాలపాడు, పెదపవని గ్రామాల్లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకులు, పోస్టాఫీసులు ద్వారా అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పీఎం జేజేబీవై పథకాల్లో చేరడం వలన భవిష్యత్‌లో వారి కుటుంబాలకు ప్రయోజనాలు కలుగుతాయన్నారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం పోషన్ అభియాన్, పీఎం కిసాన్, జల్‌జీవన్‌మిషన్, స్వచ్ఛభారత్ తదితర పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. వికసిత్‌భారత్ క్యాలెండర్‌లను పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి అబ్రహాంలింకన్, ఏపీఓ సమీర్‌బాషా, సర్పంచ్ మందా మరియమ్మ, ఎంపీటీసీ కన్నె వెంకమ్మ వైస్ సర్పంచ్ దశరథరామ్మూర్తి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గుడ్లూరు: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని స్వర్లాజీపురంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన నేలటూరి సాల్మాన్ అక్రమంగా మద్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ ఉంచి అమ్ముతున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి దాడి చేసి సాల్మాన్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

బిల్లు తీసుకుంటేనే లాభాలు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. వినియోగదారుల వివాదాల కమిషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు డి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వస్తువులను కొనేటప్పుడు తప్పకుండా బిల్లు తీసుకోవాలన్నారు. ఏదైనా వివాదం వచ్చినప్పుడు బిల్లు అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. వినియోగదారుల వివాదాల కమిషన్ సభ్యురాలు డాక్టర్ ఎస్ఏ సమీరా మాట్లాడుతూ వినియోగ హక్కులు చట్టం 2019లో ఉన్న ఆరు రకాల హక్కులు గురించి, వినియోగదారుల బాధ్యతల గురించి వివరించారు. ఈ వివాదాల పరిష్కారానికి కేవలం మూడు నుంచి ఆరు నెలలు మాత్రమే పడుతుందన్నారు. సరైన ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లయితే వస్తువు, విలువతో పాటు కోర్టు ఖర్చులను కూడా వినియోగదారులు పొందవచ్చన్నారు. కమిషన్ మరో సభ్యులు వై.సుందరరావు మాట్లాడుతూ మోసపూరితమైన వ్యాపార పద్ధతి పట్ల అంతా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ విషయాన్ని అవగాహన చేసుకొని నిత్య జీవితంలో సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని తెలిపారు. వినియోగదారి క్లబ్ కన్వీనర్ ఏడుకొండల నరేంద్రం, అధ్యాపకులు సీహెచ్ శ్రీనివాసరావు, శంకర్రావు, పి.రాజగోపాల్, కె.సుజాత, కేవీ పద్మావతి, జె.మైత్రి, షహనాజ్ బేగం పాల్గొన్నారు.